## ఏడవ పాఠం
## الدرس السابع

## కలిమయే తౌహీద్ నిబంధనలు 2/3
## شروط كلمة التوحيد ٢/ ٣

**4- ఇన్ ఖియాద్ (శిరసావహించుట):** పవిత్ర వచనం 'లాఇలాహ ఇల్లల్లాహ్'కు అనుగుణంగా శిరసావహించాలి, ఆచరించాలి. ఒక వ్యక్తి 'లాఇలాహ ఇల్లల్లాహ్' అర్థభావాన్ని తెలుసుకున్నాడు, దానిని మనస్ఫూర్తిగా నమ్మాడు, దానిని సమ్మతించాడు, కాని దానికి లొంగిపోయి, శిరసావహించి, దాని ప్రకారం ఆచరించకపోయినట్లైతే అతను ఒక నిబంధన; ఇన్ ఖియాద్ ను పాటించనట్లే. అల్లాహ్ ఇలా తెలిపాడు:

﴿وَأَنِيبُوا إِلَى رَبِّكُمْ وَأَسْلِمُوا لَهُ﴾ [الزُّمر:٥٤]

**{మీరు మీ ప్రభువు వైపునకు మరలండి, ఆయనకే విధేయత చూపండి}. (జుమర్ 39: 54).**

మరో చోట ఇలా ఆదేశించాడు:

﴿فَلَا وَرَبِّكَ لَا يُؤْمِنُونَ حَتَّى يُحَكِّمُوكَ فِيمَا شَجَرَ بَيْنَهُمْ ثُمَّ لَا يَجِدُوا فِي أَنْفُسِهِمْ حَرَجًا مِمَّا قَضَيْتَ وَيُسَلِّمُوا تَسْلِيمًا﴾ [النساء:٦٥]

**{కనుక (ఓ ప్రవక్తా!) నీ ప్రభువు తోడు! వారు తమ పరస్పర వివాదాలన్నింటిలో నిన్ను తీర్పరిగా చేసుకోనంతవరకూ, తర్వాత నీవు వారి మధ్య చెప్పిన తీర్పుపట్ల వారు తమ మనసులలో ఎలాంటి సంకోచానికి, అసంతృప్తికి ఆస్కారం యివ్వకుండా మనస్ఫూర్తిగా శిరసావహించనంత వరకూ వారు విశ్వాసులు కాజాలరు}. (సూర నిసా 4: 65)**

**5- సిద్ఖ్: (సత్యత):** మనిషి తన విశ్వాసములో సత్యవంతుడై యుండాలి. అల్లాహ్ ఇలా తెలిపాడు:

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللهَ وَكُونُوا مَعَ الصَّادِقِينَ﴾ [التوبة:١١٩]

**{ఓ విశ్వాసులారా! అల్లాహ్ కు భయపడండి. సత్యవంతులతో ఉండండి}. (సూర తౌబా 9:119)**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారుః

مَنْ شَهِدَ أَنْ لَا إِلَهَ إِلَّا اللهُ صَادِقًا بِهَا دَخَلَ الْجَنَّةَ [مسند أحمد، وصححه الألباني]

**"హృదయాంతర సత్యముతో 'లాఇలాహ ఇల్లల్లాహ్' సాక్ష్యం పలికినవారు స్వర్గంలో చేరుదురు". (ముస్నద్ అహ్మద్, షేఖ్ అల్బానీ సహీ అన్నారు).**

ఎవరైనా ఈ పవిత్ర వచనం కేవలం నోటితో పలికి, దాని భావర్థాలను మనస్ఫూర్తిగా నమ్మకున్నట్లయితే అతనికి ముక్తి ప్రాప్తించదు. అతడు కపట విశ్వాసులలో పరిగణించబడతాడు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తీసుకువచ్చిన వాటన్నిటిని లేదా కొన్నిటిని తిరస్కరించడం కూడా సత్యతకు వ్యతిరేకంలోనే వస్తుంది. ఎందుకనగా మనము ఆయన (ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం)కు విధేయులై ఉండాలని, ఆయన మాటల్ని సత్యంగా నమ్మాలని అల్లాహ్ ఆదేశించాడు, అంతే కాదు; ఆయన విధేయతను తన విధేయతతో కలిపి చెప్పాడు. సూర నూర్ (24: 54)లో అల్లాహ్ ఆదేశం గమనించండి:

﴿قُلْ أَطِيعُوا اللهَ وَأَطِيعُوا الرَّسُولَ﴾ [النور:٥٤]

**{అల్లాహ్ కు విధేయులుగా ఉండండి, అల్లాహ్ ప్రవక్తకు విధేయులుగా ఉండండి}.**